


"సాయంకాలం మెయిల్‌కి స్టేషన్లో నన్ను కలుసుకో-ఆత్మహత్య చేసుకొనే ముందు ఆఖరిసారి నీతో మాట్లాడాలి"- ఇదీ పేరిందేవి యిచ్చిన టెలిగ్రాం.

ఆత్మహత్య నన్నంత కంగారుపెట్ట లేదు గానీ, మద్రాసులో ఉండాల్సిన పేరిందేవి - మెయిల్‌లో ఎందుకు, ఎక్కడికి బయలుదేరుతూందా అని ఆశ్చర్యం కలిగింది. పేరిందేవికి ఏమీ తోచనప్పుడల్లా ఆత్మహత్య చేసుకుంటాననడం ఓ అలవాటు.

పేరిందేవి చాలా అందంగా వుంటుంది. అందమయినవాళ్లకి ఆత్మహత్య చేసుకొనే హక్కు లేదు. వాళ్ల కోసం మగాళ్లు చేసుకోవాలిగాని - అని నేనెప్పుడూ ఆవిడకి నచ్చచెప్తూ ఉండేవాడిని. మా కాలేజీ రోజుల్లో ఆమెని మా తరం కుర్రాళ్లంతా అనివాయితీగా ప్రేమించి, చొక్కాలు చింపుకొని, ప్రేమగీతాలు రాసి, చిన్న చిన్న ఉత్తరాలు రాసి వాళ్లన్నయ్యచేత చావు దెబ్బలు తిన్నవాళ్లే. పేరిందేవి ఆ రోజుల్లో మా కాలేజీకి బ్యూటీ క్వీన్.

చెప్పొద్దూ. నేనూ కాలేజీలో చేరిన కొత్తలో ఆమెని ప్రేమించాను. కాని మా క్లాసుమేటు, నా రూంమేటు కాళ్లు విరిగాక ఆ ప్రేమని అంతే రహస్యంగా అటకెక్కించేశాను. నాకు ప్రేమమీదకన్నా నా శ్రేయస్సుమీద నమ్మకం ఎక్కువ. ఇప్పటికీ నా కథల్లో అందమయిన అమ్మాయిని ఊహించుకున్నప్పుడల్లా, ఆ ముక్కూ, కళ్లూ జ్ఞాపకం వస్తాయి. తమాషా ఏమిటంటే అందరి కుర్రాళ్ల లోకి నేనే వెర్రితలలు పోకుండా ఉన్న పెద్దమనిషినని ఆమె దురభిప్రాయ పడింది. నా పెద్దమనిషి తరహాకి అర్థం నాలో ప్రేమలేకపోవడం కాదనీ, ప్రేమ ఫలించదన్న తెలివితేటలనీ ఆమెకితెలీదు. ఆమె యింటికి తరుచు వెళ్లేవాడిని. నాతో ఎవడెవడు ఎలాంటికొక్కిరాయి పనులు చేశాడో చెప్పుకొనేది. మగాడు చేసే పనుల్ని ఆడది ఎలా తెలికగా జమకడుతుందో-ఆమె దగ్గర మొదటి పాఠాలు నేర్చుకున్నాను.

కాలేజీ ఆవరణదాటి ఉద్యోగంలో చేరి-సాహితీ వ్యాసంగంలో పరపతిని సంపాదించుకున్నాక రెండు కోరికలు మిగిలిపోయాయి. ఒకటి-నేను చదువుకున్న కాలేజీలో నా లెక్చరర్ల ముందే ఉపన్యాసం యివ్వడం. రెండు పేరిందేవిని కలుసుకొని నా పరపతిని ఎలా అర్థంచేసుకుందో తెలుసుకోవడం. తెలుగు దేశంలో ఉపన్యాసా లివ్వడానికి పెద్ద కష్టపడక్కరలేదు. పరపతి కంపోస్టు ఎరువులో పెరిగే మొక్కలాంటిది. సుళువుగానే మొదటి కోరిక నెరవేరిపోయింది. ఇంక రెండోదే మిగిలిపోయింది.

ఓసారి ఏదో నాటకసమాజ ప్రారంభోత్సవానికి నెల్లూరు ఆహ్వానం వచ్చింది. స్టేషన్లో ఓ తెల్లటి మనిషి నన్ను రిసీవ్ చేసుకున్నాడు... పళ్లెత్తు - పెద్ద కళ్లజోడు. వెనక చిన్న కళ్లు. చాలా నమ్రతగా మర్యాదగా పలకరించాడు. సభకి మరోగంట వ్యవధి వుంది, యింటికి వెళ్దాం అన్నాడు. ఇళ్లలో మర్యాదలంటే నాకు కాస్త భయం. హోటల్‌కి పోదాం అన్నాను. 'ససేమిరా రావాల్సిందే. మిమ్మల్ని యింటికి తీసుకెళ్లడంలో ఓ పరమార్థం' ఉందన్నాడు. అదిగో, అలా మళ్లీ పేరిందేవని కలిశాను. అతని భార్య పేరిందేవని తెలిసినప్పుడు నా కాశ్చర్యం కలిగింది. పేరిందేవి యింకా అందమయినవాడిని పెళ్లిచేసుకొంటుందని నా ఊహ. స్టేషన్లో అతని నమ్రత చూసి ముచ్చటపడిన నేను, అతను పేరిందేవి భర్తని తెలిశాక సరిపెట్టుకోలేక పోయాను.

కోటేశ్వరరావు గురించి తెలుసుకొన్నాక పేరిందేవి అతనిలో ఏం చూసిందో అర్థమయింది. అతను మంచివాడు. పెద్ద మనిషి. తన గురించి తాను చాలా తక్కువ మాట్లాడుతాడు. చాలా తెలివయిన లెక్చరరని విద్యార్థులు అతని పట్ల చూపే గౌరవాన్నిబట్టి అర్థం చేసుకున్నాను. తన గొప్పతనాన్ని, అందాన్ని విరివిగా ప్రదర్శించే తోటి విద్యార్థులతో విసిగిపోయి ఉన్న పేరిందేవి అతనిలో ఒక 'రిలీఫ్'ని పొంది ఉంటుంది. మనం తరచు చూసేదాన్ని ఎదుటి వ్యక్తిలో 'మిస్' కావడమే ఒక

ప్పుడు ఆకర్షణ అనిపించుకుంటుంది. ఆ నెల్లూరు ప్రయాణంలో పేరిందేవి అందంకన్నా కోటేశ్వరరావు స్నేహం నన్నెంతో ఆకర్షించింది. ఇద్దరం చాలా తక్కువ వ్యవధిలో మిత్రుల మయిపోయాం. నేను ఆఫీసుపనిమీద విజయవాడ చేరాక వాళ్లింటికి చాలాసార్లు వెళ్లాను. కోటేశ్వరరావులో ఓ విలువయిన అస్తిని సంపాదించుకున్నట్టు పేరిందేవి ప్రవర్తించేది. అతని తలకు నూనె రాయడం దగ్గర్నుంచి, సాయంకాలం రాబోయే తలనొప్పి వరకు ఆమె పడే జాగ్రత్తలు చూస్తే నా కప్పుడప్పుడు అతనిమీద ఈర్ష్య కలిగేది. భార్యలో "పొజెసివ్‌నెస్" చాలా అందంగా వుంటుంది. అప్పటికి నాకింకా పెళ్లి కాలేదు.

ఇప్పుడు పేరిందేవి టెలిగ్రాం చూసి అమె అత్మహత్యకి క్రొత్త కారణం ఏమయివుంటుందా అని అలోచించాను. ఆ ఉదయం కోటుబొత్తాములు ఆమె కుట్టకుండా తనే కుట్టుకోవడమో, బయట హోటళ్లో కాఫీ తాగొచ్చి – అమె చేతి కాఫీ తీసుకోకపోవడమో యిలాంటి ఏ కారణమయినా కావచ్చు.

మెయిల్ పావుగంట ముందుగా వచ్చింది... అప్పటికే నా కోసం అన్ని వైపులా గాలిస్తోంది పేరిందేవి.

"ఇంత అలస్యంగా వచ్చావేం? నువ్వు రావేమోనని భయపడుతున్నాను" అంది.

"నువ్వు అత్మహత్య చేసుకున్నాక–ఏకంగా పలకరిద్దామనుకున్నా" అన్నాను నవ్వుతూ.

ముఖం ఎర్రగా చేసుకుని "ఈసారి నవ్వులాట కాదు రాము – యింటికి చేరాక అటో యిటో తేల్చేసుకుంటాను" అంది.

"ఏ యిల్లు చేరాక – మీ యిల్లా? మీ ఆయన యిల్లా?"

"ఏడుస్తున్నప్పుడు కూడా నీ హాస్యం వదులుకోవు."

"సరే. అఖరిసారి – నా అతిథ్యం స్వీకరిద్దువుగాని. కాఫీ తాగుదాం పద" అన్నాను.

"కాఫీ వద్దు, చట్టుబండలూవద్దు బాబూ–బెర్త్‌మీద నిద్రపోతున్నాడు." అంది.

"సరే. విషయమేమిటో చెప్పు" అన్నాను.

"మీ మిత్రుడు పెద్దమనిషని కదూ మొదట్నుంచీ నీ నమ్మకం."

"పొరపాటు. అతను పెద్దమనిషని నువ్వు మొదట నమ్మావు. "నీ నమ్మకాన్ని నేను నమ్మాను. కాదని యిప్పుడే మయినా ఋజువయిందా?"

మొదటిసారి పేరిందేవి కళ్లలో నీళ్లు చూశాను. "ఆయన మరో అమ్మాయి వలలో పడ్డారు."

నిర్ఘాంతపోయాను. కోటేశ్వరరావు లాంటి మనిషి యింత ఆలస్యంగా జీవితంలో మరో అమ్మాయిని ప్రేమిస్తాడంటే ఆశ్చర్యమే మరి.

"నీకంటె అందమయిన అమ్మాయి ఎవరు కనిపించారబ్బా."

"అందం లేదు నా బొందా లేదు. ఆవిడ నల్లగా కాల్చిన చింతపిక్కలాగ వుంటుంది. పొట్టిగా గిడసబారి నట్టుంటుంది. చిన్న మెల్లకన్ను గూడాను."

ఇలాంటి సందర్భంలో అడదానికి ఎదుటి మనిషి అంద వికారంగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. మెల్లకన్ను, చింతపిక్క– పేరిందేవి దృష్టి అయివుండవచ్చు. అంత అందవికారంగా వుండడం సాధ్యమేఅయితే – కోటేశ్వరరావు అభిరుచికి, ప్రేమకి అర్థం వుండదు.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు?" అన్నాడు.

"అయన నీ మిత్రుడుగా? – నన్ను దూరం చేసుకోవడంలో ఏం నష్టపోతున్నారో గుర్తుచెయ్యి" అంది.

"ఈలోపున నువ్వు అత్మహత్య చేసుకొంటే – అయన గుర్తుపట్టినా ప్రయోజనం ఉండదు" – అన్నాను.

పేరిందేవి కోపంగా చూసింది. పెళ్లి చేసుకొన్నాక – అడవాళ్లు మగవాళ్ల దయాదాక్షిణ్యాల మీద బతుకు రారని మీ మగవాళ్ల ఉద్దేశం–"

"పెళ్లిచేసుకొన్న మగవాళ్ల ఉద్దేశం కావచ్చు. నా కింకా పెళ్లి కాలేదు." అన్నాను.

అంత కష్టంలోనూ పేరిందేవికి నవ్వొచ్చింది. మొదటిసారిగా నా రెండు చేతులూ పట్టుకొని–ప్లీజ్ హెల్ప్ మీ" అంది.

"అదివారం వెళ్లివస్తాను. కోటేశ్వరరావుతో మాట్లాడుతాను. నానుంచి ఏ విషయం వినేవరకు నీ నిర్ణయాన్ని వాయిదా వెయ్యి..." అన్నాను.

పేరిందేవి తలూపింది.

మెయిల్ వెళ్లేవరకు నిలబడి యింటికొచ్చాను.

ఆ అదివారం నెల్లూరు వెళ్లాను. నేను వస్తున్నట్టు ఉత్తరం రాయలేదు. కోటేశ్వరరావుకి. నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "ఏం సార్? ఏమిటి కొత్తప్రోగ్రాం... ఏదయినా ఉపన్యాసమా?" అన్నాడు.

"అవును. యీసారి నాటక సమాజానికి కాదు. ఒక వ్యక్తికి, మీకు ఉపన్యాసం యివ్వాలని వచ్చాను. మీకు తెలుసో లేదో మీ అవిడ అత్మహత్య చేసుకోవడానికి నాలుగురోజుల కిందట వాళ్ల ఊరు వెళ్లింది" అన్నాను.

కోటేశ్వరరావు తలదించుకొన్నాడు. "మీకూ తెలిసిందన్న మాట" అన్నాడు.

"అంటే అవిడ చెప్పింది నిజమేనా?"


"కళ్యాణి గురించి అయితే నిజం కాదు"– అన్నాడు గంభీరంగా– అంత

అందవికారికి ఎంత అందమయిన పేరు!- ఆమె పేరు కళ్యాణి అన్నమాట.

"అస లింతకీ ఎవరీ కల్యాణి ?"

"కూర్చోండి. ముందు కాఫీ తాగుదాం. పది నిముషాల్లో కాలేజీకి వెళ్లాలి. కళ్యాణిని చూశాక ఆమె గురించి చెప్ప మంటారా ? ఆమె గురించి చెప్పాక చూస్తారా ?" అన్నాడు.

చూడని 'పారిస్' మహానగరాన్నేదో చూపించేంత గర్వంగా చెప్పాడతను.



ఆ మాటే అన్నాను. 'నా దృష్టిలో ఆమె 'పారిస్' నగరంలాంటిదే. ఆమెనంత అందంగా తయారుచేశారు.'

పసిపిల్లలు కొయ్య బొమ్మకి పరికిణీ వోణీ వేశాక చూసి ఆనందించినట్టులేని 'కళ్యాణిని' కళ్లలో వూహించుకొంటూ అన్నాడతను.

"కళ్యాణి అంత అందంగా వుంటుం దన్నమాట!" అన్నాను.

కోటేశ్వరరావు చిరునవ్వు నవ్వు తున్నాడు. "మీరే చూస్తారుగా ? ఆరు నెలల క్రిందటే లేబరేటరీ అసిస్టెంటుగా మా కాలేజీలో చేరింది... **She is virtually my Creation**" అన్నాడు.

కళ్యాణి గురించి పేరిందేవి చెప్పిన దానికీ, కోటేశ్వరరావు మాటకీ పొంతన కుదరలేదు. ఇద్దరిలో ఒక్కరే నిజం చెప్పి వుండాలి. ఎవరు చెప్పినట్టు? కళ్యాణిని చూడాలన్న ఆత్రం ఎక్కువ యింది.

కోటేశ్వరరావుతో కలిసి కాలేజీకి వెళ్లాను. రసాయనాల వాసనకొట్టే హాలులో ఒక మూల కుర్చీవేసి కూర్చో పెట్టాడు. మొదటి పీరియడ్ విద్యార్థులకు పాఠం చెప్పుకుపోతున్నాడు. ఏదో ప్రయోగాలు చేసి చూపిస్తున్నాడు. అపుదల లేకుండా మాట్లాడే తీరు, మాట్లాడుతున్నంతసేపూ చిరునవ్వు- అతనిలో కొత్త అందంలా కనిపించింది. ఇది కోటేశ్వరరావులో నా కంతవరకు తెలియని ఆకర్షణ. ఆ కళ్యాణి ఎవరో అతనివేపు ఆకర్షింపబడడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

గంట గడిచిపోయింది. నే నెందుకు ఎదురుచూస్తున్నానో నాకే అర్థం



కాలేదు. విద్యార్థులు వెళ్లిపోయారు. ఈలోగా ఎవరో తెల్లటి చీరకట్టుకున్న స్త్రీ వచ్చి అతని పక్కన నిలబడింది. నెమ్మదిగా రహస్యం చెప్తున్నట్టు మాట్లాడుతోంది. ఆమెను నా దగ్గరికి తీసుకొచ్చి పరిచయం చేశాడు కోటేశ్వర రావు.

ఆమెను చూడగానే నివ్వెరపోయాను. నోట మాటరాలేదు, ఆమె వేపే రెండు కళ్లు అప్పగించి చూస్తూ నిలబడ్డాను. పేరిందేవి చెప్పిన మాటలో ఒక్క అక్షరం పొల్లులేదు. కళ్యాణి నల్లగా - పొట్టిగా వుంది. నోరిప్పితే తెల్లటి పళ్లు వినా, ఆమె సిగలో మల్లెలు తప్ప ఆ శరీరంలో ఎక్కడా తెలుపులేదు. కన్ను మెల్ల. మొదటిసారిగా పేరిందేవి నిజాయితీ మీద గౌరవం పెరిగింది. కోటేశ్వరరావు అభిరుచిమీద సన్న గిల్లింది.

"కోటేశ్వరరావు నవ్వుతున్నాడు. ఆ ఈయన గొప్ప రచయిత. మా ఆవిడని కాలేజీలో ప్రేమించిన క్లాస్‌మేట్స్‌లో ఈయనొకరు" అన్నాడు.

కళ్యాణి చిరునవ్వు నవ్వుతూ నమస్కారం చేసింది.

సృష్టిలో ఏదో ఒక్క కోణంలో విచిత్రమయిన అందాన్ని అమర్చాడు దేవుడు. అతి జుగుప్సాకరంగా కనిపించే పీతనడకలో వయ్యారం కూడా సరిగ్గా చూస్తే కాస్తవింతగా కొత్తగా కనిపిస్తుంది కళ్యాణి చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె అందవికారాన్ని సగం క్షమించగలిగాను నేను. ఆమె నలుపుని మరిపించే మెరుపులాగ కనిపించింది ఆ నవ్వు.

ఆమె మాటల్లో సాధారణంగా స్త్రీ గొంతులో కనిపించే మార్దవంలేదు. ఆ విషయం ఆమెకీ తెలుసు. అందుకనే గొంతు విప్పి స్ఫుటంగా మాట్లాడదను కుంటాను. కాని తేలికగా రహస్యం లాగ, నెమ్మదిగా మాట్లాడడంలోనే ఓ కొత్త హుందాని సంపాదించుకొంది. ఉన్న అందాన్ని బాహాటంగా ప్రదర్శించుకోవడం వికారంగా వుంటుంది. కళ్యాణికి తనకు లేనిదేమిటో తెలుసు. వాటిని ఎలా భర్తీ చేసుకోవాలో తెలుసు.

ఆమె వెళ్లాక - నేనింకా అలాగే నిలబడి వుండడం చూసి నవ్వుకున్నాడు కోటేశ్వరరావు. "ఇప్పుడు కళ్యాణి గురించి చెప్తాను రండి. ఆమె గురించి తెలుసుకోడానికి మొదటి అర్హతని సంపాదించుకొన్నారు," అన్నాడు—

ఇద్దరం కలిసి లైబ్రరీలోకి వచ్చి కూర్చున్నాం. చెప్పాడు-

"కాలేజీలో చేరిన రెండు నెలలవరకు ఆమె గురించి నేనూ పట్టించుకోలేదు. ఓ రెండు నెలల కిందటి వరకు ఆమెకూడా కాలేజీలో ఎవరిగురించీ పట్టించుకొనేది కాదు. ఏదో నేరంచేసిన మనిషిలాగ తననీ, తన ముఖాన్నీ నలుగురికీ కనిపించకుండా దాచుకు తిరిగేది. ఎప్పుడూ ఆలేబరేటరీ దాటి వచ్చేది కాదు. బయట ఎండలోకి చూస్తూ ఏదో శాపం నుంచి, విముక్తికి ఎదురుచూసే దేవతలాగ కనిపించేది. కాలేజీ కుర్రాళ్లు 'బ్లాకీ' అని పేరు పెట్టారు. లేబరేటరీలోకి వచ్చినప్పుడు ఆమెను చూసి ముసిముసి నవ్వులు నవ్వుకోవడం నాకు తెలుసు. ఏదో చెయ్యని నేరానికి శిక్ష అనుభవించే నేరస్థురాలిగా ఆమె కనిపించేది ?"

సిగరెట్టు వెలిగించాడు.

"కట్టులో, బొట్టులో శ్రద్ధ ఉండేది కాదు. ఏదో చీరకట్టుకొని వచ్చేది. ఎప్పుడు గొంతు విప్పి మాట్లాడినా ఎందుకో క్షమాపణ చెప్పుకుంటున్నట్టుండేది. "కాలేజీ వార్షికోత్సవానికి రెండు రోజుల ముందే శలవు పెట్టేసింది. ఉత్సవంలో ఎక్కడా కనిపించలేదు. తర్వాత తెలిసింది. నలుగురి మధ్యకీ రావలసిన ప్రమాదంనుంచి తప్పు కోడానికే శలవు పెట్టిందని"-

"కాని యిప్పుడలా కనిపించడం లేదే !" అన్నాను.

"థాంక్స్" అదే నేను ఆమెలో సాధించిన విజయం అన్నాడు గర్వంగా.

"అదేమిటి ?"

"అవును సార్. జన్మతః ఆమె స్త్రీ గాని, స్త్రీత్వాన్ని గుర్తుచేసే ఏ అనుభవమూ ఆమె జీవితంలో తొంగిచూడలేదు. రోడ్డుపక్క గుడ్డిపువ్వుని ఎవరూ తలలో తురుముకోరు. ఎందుకంటే పదిమందిని ఆకర్షించే అందంకాదు దానిది. కాని వర్షం పలకరింతకి అది కాసేపయినా తలెత్తి చిరునవ్వు నవ్వుతుంది. ఆదృష్టి వున్న ఒకరిద్దరినయినా, అది కాస్సేపు ఆలోచించేటట్టు చేస్తుంది. కళ్యాణిలో అందవిహీనత కన్నా ఆ గుర్తింపులో ఆమెపడే మధన నలుగురి గుర్తింపునుంచీ పారిపోవాలనే ఆరాటం నాకు చాలా జాలి కలిగించింది. ఆమె గురించి ఆలోచించడం ప్రారంభించాను. ప్రేమతో కాదు, జాలితో. వ్యక్తిగా చాలా గంభీరమయిన మనిషి. చాలా మంచిది. మంచితనం చొరవ చూశాక, పదిమందికి దూరంగా ఉండడంలో ఏర్పడిందే - వ్యక్తి రూపానికి మోసపోయి మనం చాలా మంచి మనుషుల్ని నష్టపోతాం. ఈ లోకంలో సౌందర్యమంతా కేవలం కళ్లదే అయితే, ఈ పాటికి చాలా మంది ఆత్మహత్యలు చేసుకొనేవారు. పక్క వ్యక్తిని కాకపోయినా, తమని తామయినా ఓదార్చుకొనే గర్వమో నమ్మకమో ఉండాలి. అది కళ్యాణిలో కల్పిస్తే? యిది ఒక్కరోజులో తేల్చుకొన్న ఆలోచనకాదు - ఆమెను చూసినప్పడల్లా రూపం దిద్దుకొన్నంత ఆలొచన-

"కళ్యాణి క్రమక్రమంగా సమాధానం దొరకని క్రాస్‌వర్డ్ పజిల్‌లాగ కనిపించేది-నవ్వు ఆమెలో ప్రత్యేకమయిన అలంకారమని తెలిసి-ఆమెలాగ ఎప్పుడూ

హాస్యంగా మాట్లాడేవాడిని. ఆ నవ్వులో గొప్పతనం ఆమెకి తెలిసేటట్టు చేశాను–

"మీలో నవ్వుని చూడాలనే మాట్లాడు తున్నానని" చెప్పాను– కళ్యాణి సిగ్గు పడింది. బహుశా జీవితంలో మొదటి సారిగా ఆడదానిలో అందం ప్రత్యేక మయిన వరం కావచ్చు. కాని స్త్రీత్వం ఆమెకు జన్మతః వచ్చే హక్కు. ఒక మగాడి గుర్తింపు ఆమెను బహుశా ఆలోచించేటట్టు చేసి వుండొచ్చు.

"అసలు తెల్లచీరల ప్రయోజనం ఏమిటో తెలుసా? మీలాంటివాళ్ల అందాన్ని గుర్తించేటట్టు చెయ్యడానికి" అన్నాను ఒకరోజు యథాలాపంగానే అన్నట్టు–

అంతే – వారంరోజుల్లో ఆమె అవ తారం మారిపోయింది. సోమవారం తెల్లటి చీరతో కాలేజీకి వచ్చింది.


ఆమెని చూసి – "థాంక్స్" అన్నాను.

"ఎందుకు ?" అంది ఆశ్చర్యపోతూ.

"నా అభిప్రాయం మీలో అంద మయిన రూపు దిద్దుకున్నందుకు– **I am after all right"** అన్నాడు.

"కళ్యాణి మళ్లీ సిగ్గుపడింది. అసలు అందం అలవాటు అంటాను. క్లియో పాత్రాను నెలరోజులపాటు చూసే అవ కాశం మొహం మొత్తుతుందనుకుంటాను. అలాక్కాక ఓ కుంటిపిల్ల క్రమంగా స్త్రీగా, ఆరోగ్యంగా కోలుకోవడం ముచ్చటగా కనిపిస్తుంది. అందం అందం గానే బతకడంలో **mon tony** వుంది. కురూపి అందాన్ని సంతరించుకోవడంలో **creativity** ఉంది.

"కాలేజీలో ఉన్న రెండువేల మందిలో రెండుకళ్లు ఆమెలో మార్పుని గుర్తిస్తు న్నాయని ఆమెకి తెలుసు. మరో నెల రోజులకి ముత్యాల దండ వేసుకొంది... ముక్కు పుడక పెట్టుకుంది. క్లాసులో



కూడా యిదివరకులాగ బెరుకులేకుండా నా దగ్గరికి వచ్చి నలుగురిముందు మాట్లా డడం ప్రారంభించింది. నలుగురూ ఆమెని ఆశ్చర్యంగా చూడడం ప్రారంభించారు. వాళ్లు చూడడానికి కారణం ఆమె అందం కాక పోవచ్చు. కాని యింత కాలం సిగ్గుతో కుంచించుకుపోయిన ఒక వ్యక్తిలో మార్పు వాళ్లని ఆశ్చర్య పరిచింది. ఆమెలో మార్పు వాళ్లు గుర్తించిన అందం – మార్పుకోసం ఆమె ప్రయత్నం నేను గుర్తించిన అందం–

"శరీరంలో అందంతో సరిపెట్టుకొని, యితరత్రా ఎన్నో వికారాల్ని పోగు చేసుకుంటారు ఆడవాళ్లు." అది మితి మీరనంతవరకు వాళ్ల ఆకర్షణకి భయం లేదు. కాని కళ్యాణి శరీరాన్ని మరిపించే అందాన్ని క్రమంగా పోగుచేసుకొంది. యిప్పుడు ఆమె – నలుగురూ కాసేపయినా ఆలోచించే ఓ ప్రత్యేకమయిన వ్యక్తి– మొన్న ఓ ఫంక్షన్‌లో అందరూ ఆశ్చర్య పోయేలాగ స్టేజిమీదకి వచ్చి ఓ పాట పాడింది. అందరూ దిగ్భ్రాంతులయి పోయారు. ఇది నేను కూడా గమనించని విషయం. కళ్యాణి అద్భుతంగా పాడు తుంది. ఇవాళ కాలేజిలో ఆమె స్టార్."

"ఈ మార్పుకి కారణం మీరేనని ఆమెకి తెలుసా ?"

"తెలుసు. చాలాసార్లు నేనే స్వయంగా కాఫీ హోటలుకి ఆహ్వానించాను. ఆమె

వ్యక్తిగత జీవితాన్ని గురించి గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేశాను. పొద్దుట లేచాక దినచర్య ఏమిటి? ఏ పౌడరు వాడుతుంది. ఏ సినిమాలంటే యిష్టం? నవలలు చదువుతుందా? యిలాంటివి. ఆమెకి క్రాస్ వర్డ్ పజల్సంటే చాలా యిష్టం. రోజూ ఆ ప్రశ్నలకి సమాధానం వెదకడంలో ఆమెకు ఓ తెలియని ఆనందం వుంది."

"నాక్కావలసింది ఆ ప్రశ్నలకి సమాధానం కాదు. సమాధానం వెదకడానికి ఆమె చేసే ప్రయత్నం – ఏ పౌడరు వాడుతారు? అని అడిగినప్పుడు ఆమె ఏం చెప్పాలో తెలీక తడబడటం తెలుసు. బహుశా–అటువంటి వేమీ వాడేది కాదేమో కాని తప్పని సరిగా ఆ రోజు యింటికి వెళ్తూ పౌడరు డబ్బా కొనుక్కు వెళ్లి వుంటుంది. మర్నాడు నాతో మాట్లాడేటప్పుడు క్యూటికురా వాసన స్పష్టంగా తెలిసింది".

కోటేశ్వరరావుని ఆశ్చర్యంగా చూశాను.

మనిషి జీవ లక్షణానికి – కొత్త అర్థాలు వెదికే గొప్ప పరిశోధకుడు లాగ కనిపించాడు ఆయన–

"కళ్యాణి యిప్పుడిప్పుడే రంగులు సంతరించుకొంటున్న గడ్డి పువ్వు." అది ఒక్కరి దృష్టిని ఆకర్షించగలిగినా నా ఆనందానికి హద్దులుండవు."

"ఆ ఆకర్షణ మీ మీదే వాలిందని మా ఆవిడ అనుకుంటోంది." నవ్వాడు కోటేశ్వరరావు. "నేనంటే ఆమెకి కృతజ్ఞత వుంది. కాని ప్రేమకాదు. అది యింకా చాలా దూరం. ఆమెని చూసినప్పుడు ఒక వ్యక్తి అస్థిత్వానికి అందమయిన రూప కల్పన చెయ్యగలిగినందుకు ఆనంద పడుతూంటాను" అన్నాడు.

"మరి యిదంతా పేరిందేవికి చెప్పలేకపోయారా?" అన్నాను. నవ్వాడు కోటేశ్వరరావు. కళ్యాణిలో మంచి మార్పుని ఊహించాక నేను ఆలోచించడం ప్రారంభించాను. నాలా చెడు మార్పుని నమ్మక మా ఆవిడ ఆలోచనలు పెంచుకుంది. కళ్యాణిలో అందాన్ని గుర్తు పట్టడం లాగే, మా ఆవిడ మూర్ఖత్వాన్ని గుర్తు పట్టడానికి కాస్త వ్యవధి కావాలి" అన్నాడు.

అవును. పేరిందేవిలో ఒక సృష్టి రహస్యాన్ని చూసున్నాడు కోటేశ్వరరావు. కేవలం ఆడదాన్నే చూస్తోంది పేరిందేవి. భార్యగా ఆమెకు కలిగిన సంశయం మిత్రుడిగా నాకు కలగకపోవడంలో ఆశ్చర్యంలేదు.

"ఇప్పుడేం చేస్తారు? మీ ఆవిడ ఆత్మహత్య చేసుకుంటానంటోంది." అన్నాను.

కోటేశ్వరరావు పగలబడి నవ్వాడు. "అని వారం రోజులు గడిచిపోయింది సార్. చేసుకుంటే ఈ పాటికి చేసుకోవలసింది" అన్నాడు.

నాకూ నవ్వొచ్చింది. మరొక రోజు కోటేశ్వరరావుతోనే వున్నాను. కళ్యాణిని ఆ సాయంకాలం భోజనానికి ఆహ్వానించాడు. ముగ్గురం కలిసి హోటల్లో భోజనం చేశాం. ఆశ్చర్యం – ఉదయం ఆమెలో కనిపించిన అంద విహీనత బొత్తిగా కనిపించలేదు నాకు కోటేశ్వరరావు మాటలు విన్నాక–మార్పుకై – ఒక గొప్ప ప్రయోగం ఆమెలో జరుగుతోందని గ్రహించాను. సర్వరు భోజనానికి అన్నీ అమర్చాక–తను ప్రత్యేకంగా కల్పించుకొని– అది తన యిల్లు అయినట్టుగా ఎంతో నేర్పుగా ఓర్పుగా మా యిద్దరికీ వడ్డించింది.

ఆ సాయంకాలం గడిచాక కోటేశ్వరరావు మాటల్లో పరమార్థం మరీ కొట్ట వచ్చినట్టుగా కనిపించింది.

ఇంటికి బయలుదేరుతూ కోటేశ్వరరావుని అడిగాను, "మీ ఆవిడకి ఏం చెప్పమంటారు?" అని.

"ఆత్మహత్య భర్తల్ని వెనక్కి తీసుకొచ్చి అప్పగించిందని చెప్పండి. తను స్వయంగా నాటిన మొక్క పెరిగి పూలు పూస్తోంటే తనే నాశనం చెయ్యదని చెప్పండి," అన్నాడు.

విజయవాడ వచ్చేశాను.

తర్వాత పేరిందేవి చాలా రోజులు పుట్టింట్లోనే వుండిపోయింది. నాకు ఉత్తరాలు రాస్తే మరి నాలుగుయిదుసార్లు కోటేశ్వరరావు దగ్గరికి నేనే వెళ్లి వస్తూ వుండేవాడిని.

కోటేశ్వరరావులో అభిరుచినీ, అభిలాషనీ ఏ విధంగానూ పేరిందేవి అర్థం చేసుకో లేకపోయింది, నేను వివరంగా చెప్తే–

"ఆడాదాన్ని ఉద్ధరించడానికి ఈయనకేం అవసరం– ఆ చింతమొద్దుని ఈయన బాగుచెయ్యకపోతే ఏం కొంప మునిగింది. పెళ్లాన్ని దూరంచేసుకొని పై ఆడవాళ్లని ఉద్ధరించే భర్త దగ్గరికి నేను చస్తే వెళ్లను," అంది.

నాకు నవ్వొచ్చింది. కోటేశ్వరరావు ఆ మాటకి నవ్వుకొన్నాడు.

ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో నాకు ఎంత తల బద్దలు కొట్టుకున్నా చాలా కాలం వరకు అర్థంకాలేదు. చివరికి ఎలాగయితేనేం, నేనే ఆ సమస్యని పరిష్కరించాను. ఎలాగంటే–

నేను కళ్యాణిని పెళ్లిచేసుకొన్నాను.

ఆమె మీద జాలితో కాదు. తనని తాను అలంకరించుకొంటూ, మొదటిసారిగా బయటి ప్రపంచాన్ని నిర్లక్ష్యంగా, గర్వంగా చూడగలిగే ఓ గడ్డిపువ్వు పట్ల గౌరవంతో–